# రాజీ

**క్లాక్ టవర్** దగ్గరికొచ్చి మాధురి వెనక్కి తిరిగి చూచింది. ఆమె వూహ కరెక్టే అయింది. అతను ఆమెను వెంబడిస్తున్నాడు. ఆమె ఆగి వెనక్కి తిరిగి తనవైపు చూడటంతో అతనూ ఆగి ఆకాశంవైపు చూడసాగాడు.

"ఛీ.... ఛీ... ఒట్టి పిరికి మనిషి" అనుకొని మాధురి చిరాకుపడింది మనసులో.

అతను నెలరోజులుగా ఆమెను అలా వెంబడిస్తూనే ఉన్నాడు. కాలేజీనుంచి ఆ క్లాక్ టవర్ దాకా వెనక అంగ రక్షకుడులా వస్తాడు. ఒక మాటా లేదు, పలుకూ లేదు. నవ్వు లేదు. ప్రేమ లేఖా లేదు. అలా వెంబడించటం తన పవిత్ర కర్తవ్యమన్నట్లు కొన్ని బారల దూరంలో వెనకే నడుస్తాడు. ఆమె క్లాక్ టవర్ దాటగానే అంతర్థానమై పోతాడెటో.

నెల రోజుల క్రితం అతను అలా వెంటబడ్డప్పుడు ఆమె అతడిమీద ఎన్నో ఆశలు పెంచుకుంది. వారం దాటేకైనా ముందడుగు వేస్తాడని ఆశించింది. కానీ నెలైనా అతడి పద్ధతిలో మార్పు లేందే?

మాధురి అందగత్తె. తాను అందగత్తెనన్న స్పృహ ఆమెకు ఉంది. ధనవంతులు ధనవంతులనే పెళ్ళి చేసుకొన్నట్లు అందగత్తెలు అందగాళ్ళనే చేసుకోవాలన్నది ఆమె మతం.

భార్యా భర్తల జంటలో ఒకరు ఎత్తు, ఒకరు పొట్టి, ఒకరు నల్లటి నలుపు, రెండోవారు తెల్లటి తెలుపు, ఒకరు అందంగా ఉంటే, మరొకరు కురూపులైన జంటల్ని ఎన్నింటినో చూచింది. అలాంటి జంటల్ని చూస్తుంటే ఆమెకు అసహ్యం. ఒళ్లు మంట.

భార్యా భర్త లిద్దరూ 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అన్నట్లు ఉండాలి. అలాంటి జంటల బొమ్మలు పత్రికల్లో పడితే కట్‌చేసి దాచుకొంటుంది.

అలాంటి కాంప్లెక్సు ఆమెకు ఏర్పడటానికి కారణం ఆమె తలిదండ్రులే. ఆమె తండ్రి అందంగా ఉంటాడు. తల్లి అనాకారి. అంతటి అందగాడైన తన తండ్రి అంతటి అనాకారైన తన తల్లిని ఎలా చేసుకొన్నాడా అన్నది ఆమె మనస్సులో సాల్వు చేయలేని వో పజిల్.

తన తండ్రి చేసిన పొరపాటు చేయదల్చుకోలేదు మాధురి. అందుచేత ఆమె తన భర్తను తానే సెలక్టు చేసుకొదలిచింది.

కాలేజీలో వెంట వెంట తిరిగే వాళ్ళకు, వెకిలి వేషాలు వేసేవాళ్ళకు కొరతలేదు. కానీ వాళ్ళలో ఆమెకు ఒకరూ నచ్చలేదు. కొందరు ఎలుగు బంటుల్లా, మరికొందరు చింపాంజీల్లా కన్పించా రామెకు.

ఆమెకు నచ్చిన వాళ్ళు అమె పట్ల శ్రద్ధ చూపలేదు. చూపినా పెళ్ళిదాకా వెళ్ళే పెద్ద మనుష్యుల్లా

కన్పించలేదు కొందరు.

ఆమె చదువు మరో రెండు నెలల్లో ముగియవస్తోంది. పై చదువులకు పంపించే శక్తి తలిదండ్రులకు లేదు. చదువు ముగియ వస్తున్నది కనుక తగు మాత్రం సంబంధం చూచి ఆమెకు మూడు ముళ్ళు వేయించాలని తలిదండ్రులు ప్రయత్నిస్తున్నారు.

మాధురి అందుకు అభ్యంతరం చెప్ప లేదు. పెళ్లి చూపులు జరుగుతూనే ఉన్నాయి. ఆమెకు ఒక్కరూ నచ్చటంలేదు. ఆమె అదృష్టం బాగుండి, వాళ్ళకు ఆమె తండ్రి ఇస్తానన్న కట్నం అంకె నచ్చకపోవటంచేత ఆమెకు సమస్య లేకపోయింది.

తనకు నచ్చినవాడు, దీటైనవాడు పెళ్ళి చూపుల్లో తటస్థపడి, ఆ పెళ్ళి ముడిపడుతుందన్న సమ్మకం ఆమెకు కలగలేదు.

ఎప్పటికైనా తన అందాన్ని చూచి తనని ప్రేమించిన వాడితోనే తన పెళ్ళి జరుగుతుందన్న అభిప్రాయం ఆమెకు ఏర్పడింది. కాలేజీనుంచి వస్తూ అలాటి వాడికోసం అన్వేషణలు చేయ సాగింది.

ఇకిలించే వాళ్ళకు, ఈలవేసే వాళ్ళకు అల్లరి చిల్లరి వాగుడుకాయలకు కొరత లేదు. కానీ తను పెళ్ళి చేసుకోబోయే వాడు........

అతను నెల రోజుల క్రితం ఆమె దృష్టిలో పడ్డాడు.

అతను చాలా అందంగా ఉంటాడు. మనిషి పర్సనాలిటీలో ఒక హుందాతనం ఉంది. అతను తనను పెళ్ళి చేసుకుంటానంటే ఎంత బాగుండును, అని ఆమె ఎన్నోసార్లు అనుకొంది.

కానీ అతను చొరవ తీసుకోండే! ప్చ్!

కాస్త ఆలోచించి ఆమె అతనికి ఒక అవకాశాన్ని ఇవ్వదలుచుకొంది. ఏదో కొనటానికన్నట్లు ఆమె పక్కనున్న ఫాన్సీ షాపులోకి దూరింది.

అతను లోపలికొస్తాడు. ఆమె పక్కన నిలబడి ఆమె కొనదలుచుకొన్న వస్తువును తను కొని ఆమెకు ప్రెజెంట్ చేస్తాడు. తను సిగ్గుపడుతూ 'థాంక్స్' చెపుతుంది. అతను కాఫీకో, సినిమాకో ఆహ్వానిస్తాడు. అలా పరిచయం పెరిగి ప్రేమలోకి, తర్వాత పెళ్ళిలోకి మారుతుందని ఆమె ఆశించింది.

రిబ్బనుల దగ్గర నుంచి ఫాన్సీ చెయిన్స్ దాకా ఎన్నో ఐటెమ్స్‌ను షాపులో ఆమె బేరం చేసింది.

కానీ అతను రాడే!

తనే వెళ్ళి అతడిని ప్రేమిస్తున్నట్లు చెప్పాలి కాబోలు! అందగాడినన్న అహంకారమా? చొరవ తీసుకోలేని అసమర్థతా?

"ఏం మేడమ్? ఈచెయిన్ పేక్ చెయించనా?"

"వద్దు. నాకు నచ్చలేదు." ఆమె చిరాకుగా బయటికి వెళ్ళుతుంటే షాపు వాడు ఏమీ అనలేక గుటకలు మింగేడు.

★ ★ ★

మాధురి చిరాకుతోనే ఇంటి కొచ్చింది. చెప్పుల్ని కాళ్ళతోనే విసిరి మూలకు కొట్టింది.

"వచ్చావుటే, మాధురీ. నీకోసమే ఎదురుచూస్తున్నాం. నా తల్లి అదృష్టవంతురాలు. ఆ మొహంలో పెళ్ళికళ తాండవిస్తోందని నాకు తెలుసు" తల్లి ఒకటే పొగుడుతోంది.

అప్పుడు గమనించింది మాధురి--- ఇల్లంతా కళకళలాడుతున్నట్లు ఉంది.

"ముందు మొహం కడుక్కొని రా. నీకని ప్రత్యేకంగా పాయసం, మైసూర్‌పాక్, అరటికాయ బజ్జీలు చేసేను. నీకిష్టమైన టిఫిన్‌లతోపాటు నీకు అంతకంటే ఇష్టమైన వో శుభవార్త చెబుతాను."

శుభవార్త! కొంపతీసి మొన్న పెళ్ళి చూపులకొచ్చి పోయిన కోతిగాడికి తను నచ్చలేదు గదా?

"అక్కయ్య మొగుడు ఈ చెల్లెమ్మకు బావ

పెళ్ళనగానే అక్క బుగ్గలు ఎరుపెక్కితే

బావ చెవులు మెలేయొచ్చని చెల్లెమ్మ సంబర పడుతోంది.

నీ మొగుడిని ఆటలు పట్టించేనని

ఈ చిన్న చెల్లెలు మీద అలిగేవు వోయమ్మా అక్కయ్యా..." చెల్లెలు ఎగతాళిగా పాడసాగింది.

మొన్న పెళ్ళిచూపులకొచ్చిన కోతి మనిషికి తను నచ్చింది. కట్నం దగ్గర పెద్ద పేచీలు పెట్టకుండా అంగీకరించారు. పెళ్ళికి ముహూర్తాలు పెట్టమని రాసేరు.

ఆ రాత్రంతా ఆమె ఆలోచించింది. ఇంట్లో అందరికీ సంతోషదాయకమైన ఆ వార్త ఆమెకు దుఃఖదాయకమైంది.

అతని పేరు ప్రభాకర్. ఎక్కడో మంచి ఉద్యోగమే చేస్తున్నాడు. ఆస్తిపాస్తులూ ఉన్నాయి. కుటుంబం మంచిది. అవన్నీ బాగున్నాయి. కానీ అతని రూపం-బాబోయ్...!

అతడిని తన పక్కన నిలబెట్టి చూచుకొంది. భయం!

తనని వెంబడిస్తున్న అతడిని తన పక్కన నిలబెట్టుకొని చూచుకొంది. ఆనందం! పులకింత!

"నాకీ పెళ్ళి ఇష్టం లేదు. నేను ఆ చింపాంజీని చేసుకోను." ఆమె మనసులో పెద్దగా అరిచింది.

★ ★ ★

తెల్లవారేక తలిదండ్రులందరి ముందు అదే ముక్కను అంది. తలిదండ్రులు అరిచి గోల చేయలేదు.

"అయితే నీకు నచ్చిన మన్మథుడిని వరించు. కట్న కానుకల విషయంలో నా శక్తిసామర్థ్యాలు నీకు తెలుసు. అంతకు అంగీకరించిన ఎవరికైనా సరే కులం, గోత్రం అడగకుండా నిన్నిచ్చి పెళ్ళిచేస్తాను. సరేనా? వాళ్ళకు మన అభిప్రాయం రాసే ముందు నాలుగు రోజులు నీకు టైము ఇస్తున్నా" అన్నాడు తండ్రి.

ఈ నాలుగు రోజుల్లో అతను ఆమె ఆశించినట్లు వో అడుగు ముందుకేసేడు. ఆమెకు ప్రేమలేఖ అందించాడు.

ఆ లేఖ పట్టుకొని అందులో అతను అభ్యర్థించినట్లు మాధురి పార్కులో అతడిని కలిసింది. అతడు ప్రేమించానన్నాడు. పెళ్ళి చేసుకోవటానికి సిద్ధమేనన్నాడు.

ఆ తరవాత అతడన్న మాటల్ని ఆమె వినిపించుకోలేదు. ఆమె మనసంతా ఆనందంతో నిండిపోయింది.

ప్రేమ! ప్రేమించిన మనిషిని పెళ్ళి చేసుకోవటం ఎంత అదృష్టం?

"ఆ ప్రభాకర్ వాళ్ళ సంబంధాన్ని కేన్సిల్ చేయండి, నాన్నా. నేనొకణ్ణి ప్రేమించాను. అతనూ నన్ను ప్రేమించాడు. పెళ్ళి చేసుకొంటానన్నాడు" అంది గర్వంగా.

"సంతోషమమ్మా" అన్నాడు తండ్రి ఆమె మొహంలోకి చూస్తూ.

"నీ భర్తను నువ్వు ఎన్నుకుంటే నేనెందుకు కాదంటాను? నీ అందాన్ని చూచి ఆ ప్రభాకర్ నిన్ను వరించాడు. మనకన్నా ఎక్కువ కట్నం డబ్బు ఇచ్చేవారొచ్చినా కాదని నిన్ను చేసుకోవటానికి సిద్ధపడ్డాడు. అంటే అతను నిన్ను ప్రేమించాడన్న మాట. కానీ నువ్వు అతడిని ప్రేమించలేక పోయావు. నువ్వు మరొక యువకుణ్ణి ప్రేమించావు. రూపంలో అతను అన్ని విధాల నీకు సరిపుజ్జీ అయి ఉంటాడని అనుకుంటున్నాను. అతని కులం, మతం, వంశం, సంప్రదాయం-ఇవన్నీ తెలుసుకోవటానికి నేను ఉత్సుకత చూపను. నాకు కావలసింది అతని ఆర్థికస్థితి. పిల్లని వో అయ్య చేతిలో పెట్టే ముందు భార్యను పోషించే శక్తి కలవాడా, లేదా అన్న విషయాన్ని తండ్రిగా ఆలోచించాలి కదా? అతని ఉద్యోగం ఏమిటి? లేకపోతే ఏ విధంగా ఆర్జన చేస్తున్నాడు? మిగతా ఆర్థిక స్థితిగతు లేమిటి? నువ్వు తెలుసుకొనే ఉంటావనుకొంటాను. వాటిని చెపితే సంతోషిస్తాను నేను.'

మాధురి బిత్తరపోయింది. నిరుత్తరురాలయింది!

అతని రూపాన్ని చూసి ప్రేమించి పెళ్ళి చేసుకుంటాననగానే పరవశించింది. కాని తాను ఇవన్నీ ఆలోచించలేదేం? అతని వూరేమిటో, కుల, గుణాలేమిటో, కనీసం ఉద్యోగం ఏమిటో, విద్యార్హతలేమిటో తెలుసుకోకుండా....

ఆమె సిగ్గు పడింది.

"ఆ వివరాలన్నీ రేపు చెపుతాను, నాన్నా."

☆ ☆ ☆

అతని పేరు గౌతమ్. కులాలు, మతాలు, సంప్రదాయాలు సరికి సరైన వాడే. కానీ అతని ఆర్థిక పరిస్థితి అధ్వాన్నమైనది. ఆర్థిక పరిస్థితి బాగా లేక అతను చదువును మధ్యలో ఆపేశాడు. కుటుంబ బాధ్యతలు జాస్తి. ఆదాయం పూజ్యం.

"మరి ఇన్ని కుటుంబ బాధ్యతలు పెట్టుకొని, నిరుద్యోగి అయి ఉండి, పెళ్ళి చేసుకొన్నాక పెళ్ళాన్నెలా

పోషిద్దామనుకున్నారు? భార్య మీకు మరో బరువు కాదా" అని అడిగింది మాధురి చిరాగ్గా.

"నిండా మునిగిన వాడికి చలేమిటి? పైగా ప్రేమించిన హృదయం, ఇలాంటి విషయాలనాలోచిస్తుందా?' అన్నాడు పెద్ద హీరోలా పోజు పెట్టి.

"నాకు ఆకలేస్తోంది" అందామె. అతను మాట్లాడలేదు.

ఆమె అతడిని హోటలుకు తీసుకెళ్ళింది. బిల్లు ఆమె చెల్లిస్తుంటే మాటవరసకైనా అతడు అభ్యంతర పెట్టలేదు.

అతడి ఇంటిని తాను చూస్తానని మాధురి అంటే, అతను ముందు కంగారు పడ్డా తీసుకుపోక తప్పలేదు.

ఆ ఇంట్లో ఎక్కడ పట్టినా మురికే-ఆకలే!

అద్దె ఇల్లే. ఇల్లు చిన్నది. జనాభా జాస్తి.

'రేపు పెళ్ళి చేసుకుంటే ఈ ఇంట్లోనా తన ప్రియుడితో మొదటి రాత్రి గడపాల్సింది? ఛీ ఛీ....'

ఎంత ప్రేమ ఉన్నా ఆకలి కడుపులు ఆ ప్రేమను ఎలా ఎంజాయ్ చెయ్యగలవు? ప్రేమించి పెళ్ళి చేసుకోగానే సరిపోతుందా? అది సఫలమయే పరిస్థితులు ఉండద్దూ?

తన తండ్రి, తల్లిని ఎందుకు పెళ్ళి చేసుకొని ఉంటాడో ఆమె వూహించగలిగింది. తన తల్లిది కాస్త కలిగిన కుటుంబం. తండ్రి బీదవాడు- ఆ రోజుల్లో!

"నాన్నా, వాళ్ళ సంబంధం నాకు ఇష్టమే. ప్రభాకర్ వాళ్ళ వాళ్ళకి మన ఇష్టాన్ని తెలుపుతూ ఉత్తరం రాయండి."

మాధురి తండ్రి కూతురి నిర్ణయాన్ని విని ఆశ్చర్యపోలేదు. పైగా తను వూహించినట్టే జరిగినందుకు ఆయన గర్వించాడు.

ఆయనకు అనుభవంవల్ల తెలుసు. ప్రేమ గొప్పది. కానీ అంతకన్నా గొప్పది ఆకలి.

ఆకలి లేని ప్రేమ ఆనందధాయకం.

కానీ ఆకలితో కూడిన ప్రేమ విషాదభరితం.

కనుక ప్రేమలు ఫలించాలంటే ఆకలి నిర్మూలించబడాలి. అంతవరకు ప్రేమ పేరిట సాహసాలు చేసేకన్నా, జీవితంతో రాజీపడటం ఆనందదాయకం. ఆకలితో రాజీపడటం అసాధ్యం కానీ, ప్రేమతో రాజీపడటం అంత కష్టమేమీ కాదు.

"గుడ్! నాకు తెలుసునమ్మా. నువ్వుతెలివిగలదానివి. ఎలాగైనా నా కూతురివి కదా! అన్నాడాయన గర్వంగా.

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక - 17-11-82